జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి రూ.100కోట్లు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసి రూ.వంద కోట్లు కేటాయించించదని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకం-శాంతి అనే నినాదంతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ బాపట్ల నినాదంతో గ్రోత్ ఇంజిన్‌లా ముందుకు వెళ్తుందన్నారు. బీచ్‌లలో పర్యాటకులు నాలుగైదు రోజులు ఉండేలా అన్ని వనరులు సమకూర్చుతున్నట్లు తెలిపారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టి, వసతి సౌకర్యాలు మరింత మెరుగుపరుస్తామన్నారు. 74 కి.మీ. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బీచ్‌లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. భట్టిప్రోలు బౌద్ధస్తూపం, మోటుపల్లి ఓడరేవు, భావనారాయణస్వామి ఆలయం ప్రాచీన చరిత్రకు నిలువెత్తు నిదర్శనాలన్నారు. జిల్లాలో పర్యాటక ప్రగతికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పర్యాటకుల భద్రత కోసం బీచ్‌ల వద్ద గజ ఈతగాళ్లను నియమించినట్లు తెలిపారు. మెరైన్ పోలీసుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు. జిల్లాలోని బీచ్‌లకు బ్లూఫ్లాగ్ స్థాయి రానుందని పేర్కొన్నారు. సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని జేసీని రిసార్ట్స్ యజమానులు కోరారు. జిల్లా పర్యాటక, మత్స్యశాఖాధికారి సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

జడ్పీ డిప్యూటీ సీఈవోగా కృష్ణ

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు డిప్యూటీ సీఈవోగా సీహెచ్.కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావుని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో కృష్ణని నియమించింది. మోహన్‌రావు విధుల నుంచి రిలీవ్ కావడంతో కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సీఈవో వి.జ్యోతిబసుని కలిసి రిపోర్టు చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సై

నవంబరు నాటికి పూర్తయ్యేలా ఏర్పాట్లు

ఈనాడు - అమరావతి

నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీ ప్రాజెక్టుల కింద రైతుల భాగస్వామ్యంతో ప్రతీ ఎకరాకు సాగునీరందించే దిశగా తెదేపా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రైతు ప్రతినిధులను ఎన్నుకోవడానికి వీలుగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులిచ్చింది. ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు తొలివారానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓటర్లుగా ఉన్న ఆయా కాలువల ఆయకట్టు రైతులు సమర్థులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వాటిని నిర్వీర్యం చేసింది. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతులకు నిధులివ్వలేదు. ఈ కారణంగానే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కాలువల గట్లు భారీగా తెగిపోయి వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.



కమిటీల స్వరూపం ఇలా...

కాలువల కింద 6 నుంచి 12 మందితో ప్రాదేశి నియోజకవర్గాలుగా (టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో ప్రతి ఆయకట్టుదారుడు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. వీరంతా నీటి వినియోగదారుల సంఘాన్ని (డబ్ల్యుయూఏ) ఎన్నుకుంటారు. వీటి ఛైర్మన్లుగా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను, వీరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు.

సాగర్ కాలువ కింద....

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని లింగంగుంట్ల సర్కిల్ కింద ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతాలున్నాయి. ఇందులో 259 నీటి వినియోగదారుల సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ, ఒక ప్రాజెక్టు కమిటీ ఉంటాయి.

❖ సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లున్నాయి. వీటికి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. ❖ కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు సర్కిల్ కింద అన్ని సంఘాలుంటాయి. ఇక్కడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఇందులో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైతులు ఓటర్లుగా ఉంటారు.

చిన్న నీటిపారుదలశాఖ పరిధిలో...

ఉమ్మడి జిల్లాలో చిన్ననీటిపారుదల కింద 60 డబ్ల్యుయూఏలున్నాయి. ఇందులో పల్నాడు పరిధిలో 55, గుంటూరు జిల్లాలో 5 ఉన్నాయి. ఇవన్నీ చెరువుల కింద 21,234 ఎకరాల ఆయకట్టు ఆధారంగా ఏర్పాటవుతాయి. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున ఇక్కడ డీసీ, పీసీ ఉండవు.

ఆయకట్టుదారులకు మెరుగైన సేవలు

నీటి వినియోగదారుల సంఘాలుంటే సంబంధిత ఛైర్మన్లు ఆయా కాలువల కింద సాగు నీరు సక్రమంగా వెళ్లేలా చూస్తారు. అత్యవసర పనులు చేయాల్సి వచ్చినప్పుడు అధికారులకు సమాచారం ఇచ్చి యుద్ధప్రాతిపదికన అయ్యేలా చూస్తారు. చివరి భూములకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వరదలు, భారీ వర్షాల సమయంలో కాలువలు, డ్రెయిన్ల గట్ల పరిస్థితి అధికారులకు తెలియజేసి అవసరమైన చర్యలు చేపడతారు. కాలువల మరమ్మతు, నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగిస్తారు. నీటితీరువా వసూలయ్యేలా చూస్తారు. అన్నదాతలకు అనేక ప్రయోజనాలున్నందున కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలను మళ్లీ పట్టాలెక్కిస్తోంది.

కృష్ణా పశ్చిమ డెల్టాలో...

కృష్ణా పశ్చిమ డెల్టాలోని ఉమ్మడి గుంటూరు ఆయకట్టు గుంటూరు సర్కిల్ పర్యవేక్షణలో ఉంటుంది. బాపట్ల జిల్లాలో 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) కింద 94 డబ్ల్యూయూఏలు, గుంటూరు జిల్లాలో 9 డీసీల కింద 50 డబ్ల్యూయూఏలు, ప్రకాశం జిల్లాలో ఒక డీసీ కింద 2 డబ్ల్యూయూఏలున్నాయి. గుంటూరువాహిని కింద రెండు డీసీల పరిధిలో 14 డబ్ల్యూయూఏలున్నాయి. మొత్తం 22 డీసీలు, 160 డబ్ల్యూయూలు ఉన్నాయి. ఇందులో 6 డీసీలు రెండు జిల్లాల్లో కలిసి ఉన్నాయి.

నకిలీల నిగ్గుతేల్చేలా..

అక్రమాలకు అడ్డువేసేలా..

మెప్మా విభాగం ప్రక్షాళన దిశగా చర్యలు | **వైకాపా పాలనలో బినామీల పేరుతో రూ.కోట్ల రుణాల స్వాహా**

న్యూస్‌టుడే, బాపట్ల

వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలతో భ్రష్టుపట్టిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)ను ప్రక్షాళన చేయటానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి పట్టణాల్లో స్థానికేతరులు, బినామీ సభ్యులతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రూ.14 కోట్ల రుణాలు తీసుకుని స్వాహా చేశారు. మెప్మా విభాగంలో పని చేస్తున్న సీవోలు, ఆర్పీలు అక్రమాల్లో కీలకపాత్ర పోషించారు. బ్యాంకు అధికారులు, స్థానిక సిబ్బంది కలిసి కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసి భారీగా రుణాలు కాజేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారులు సమగ్ర విచారణ చేయించి రుణాలు రికవరీ చేయటంతో పాటు నకిలీ సంఘాలను రద్దు చేయనున్నారు. అక్రమార్కులపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు.



వైకాపా నేతల ప్రోద్బలంతో మెప్మా సిబ్బంది అక్రమాలకు తెరలేపారు. ఒంగోలు, చీరాల, గుంటూరు, విజయవాడకు చెందిన మహిళల పేర్లతో బాపట్లలో నకిలీ సంఘాలు సృష్టించారు. మూడు బ్యాంకుల అధికారులు, సీవోలు, ఆర్పీలు కుమ్మక్కై ఆ సంఘాలకు రూ.ఎనిమిది కోట్ల వరకు రుణాలు మంజూరు చేయించి స్వాహా చేశారు. ఒక సంఘంలోని మహిళల పేరుతో మరోటి ఏర్పాటు చేయించారు. బ్యాంకు అధికారులు పొదుపు సంఘానికి మొదటి సారే రూ.పది లక్షల రుణం మంజూరు చేయటం గమనార్హం. రేపల్లె మెప్మా విభాగంలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయి. రూ.నాలుగున్నర కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ రుణాలు దిగమింగారు. అద్దంకి, చీరాల పురపాలక సంఘాల్లో నకిలీ సంఘాల ద్వారా రూ.కోట్లలో దారి మళ్లించారు. ఒక బ్యాంకులో ఓ సంఘం పేరుతో రుణాలు తీసుకున్నా వారికి తెలియకుండానే మరో బ్యాంకులో లింకేజీ రుణాలు తీసుకుని మింగేశారు. డ్వాక్రా మహిళలకు గృహనిర్మాణానికి రుణాల మంజూరులోను అక్రమాలకు పాల్పడ్డారు.

సిబ్బంది ఇష్టారాజ్యం..

జిల్లా మెప్మా విభాగానికి పూర్తి స్థాయి పీడీ లేరు. గుంటూరు పీడీనే బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా నియమించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో పురపాలక సంఘాల్లోని ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వీరి అక్రమాలకు వైకాపా స్థానిక నేతలు అండగా నిలిచారు. రుణాల స్వాహా వ్యవహారం బయటకు వచ్చినా విచారణ తూతూమంత్రంగా చేయించారు. విచారణకు వచ్చిన వారికి చేతులు తడిపి చర్యలు తీసుకోకుండా తప్పించుకున్నారు. బాపట్లలో రూ.8 కోట్ల రుణాలు స్వాహా చేస్తే ఒక్కరిపైనా చర్యలు లేకపోవడం గమనార్హం. రేపల్లెలోనూ ఒకరిద్దరిపై చర్యలతో సరిపెట్టారు. వైకాపా బడా నేతల ఒత్తిడితో అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారు.

ఖాతాల సమగ్ర పరిశీలనతోనే..

ఇటీవల సీఎం చంద్రబాబు సెర్ప్‌పై చేపట్టిన సమీక్షలో వైకాపా ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు ఆయన దృష్టికి వెళ్లాయి. నకిలీ సంఘాలు ఏ పట్టణంలో ఎన్ని ఉన్నాయో తేల్చాలని సెర్ప్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆడిట్, సర్వే చేసి అక్రమాల నిగ్గు తేల్చటానికి అధికారులు సిద్ధమవుతున్నారు. అన్ని బ్యాంకుల పరిధిలో సంఘాలకు మొత్తం ఎన్ని బ్యాంకు లింకేజీ రుణ ఖాతాలు ఉన్నాయన్న విషయం లెక్క తేల్చనున్నారు. పొదుపు సంఘాల ఖాతాలను సమగ్రంగా పరిశీలించి అక్రమాలు ఏ మేరకు జరిగాయో నిర్ధరిస్తారు. అక్రమాలకు పాల్పడ్డవారిని విధుల నుంచి తొలగించటమే రాకుండా స్వాహా చేసిన రుణాల రికవరీకి క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. సీఎం ఆదేశాలలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ మెప్మా ఉద్యోగులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పారదర్శకంగా పోలీసు సిబ్బంది బదిలీలు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పోలీసు సిబ్బంది బదిలీలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 175 మంది పోలీసు సిబ్బందికి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి వారు కోరుకున్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను కోరుకున్న పీఎస్‌కు బదిలీ చేశామని, నిబద్ధతతో విధులు నిర్వహించి మంచి పేరు తీసుకు రావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరంగా తీవ్ర చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి అర్జీల దినోత్సవాన్ని ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది వ్యక్తిగతంగా కలిసి తమ సమస్యలు తెలపవచ్చన్నారు. ఎస్బీ సీఐ నారాయణ, ఐటీ కోర్ ఎస్సై నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

జిల్లా రవాణాశాఖాధికారిగా పరంధామరెడ్డి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా రవాణాశాఖాధికారిగా టి.కృష్ణ పరంధామరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట నుంచి బదిలీపై ఆయన బాపట్ల వచ్చారు. కలెక్టరేట్లో కలెక్టర్ వెంకట మురళిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. పరంధామరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని, రవాణా శాఖ ద్వారా మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. ఎంవీఐ రంగారావు ఉన్నారు.


కలెక్టర్ వెంకట మురళికి పూలమొక్క అందిస్తున్న డీటీవో కృష్ణ పరంధామరెడ్డి

డీటీడబ్ల్యూవోగా ప్రకాష్‌రావు

జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా ప్రకాష్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ నూతన ఈఈగా బాధ్యతలు చేపట్టిన ఎం.అనంతరాజు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

చేపపిల్లలు పెంచే పనులు ప్రారంభం

చక్రాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: మత్స్య శాఖ ఆధ్వర్యంలో చక్రాయపాలెం వద్ద గల కేంద్రంలో చేపపిల్లలు పెంచే పనులు ప్రారంభమయ్యాయి. 'ఈనాడు'లో జులై 22న ప్రచురితమైన 'చేప పిల్లలు ఎక్కడ పెంచాలి' అనే కథనానికి మత్స్యశాఖ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. కేంద్రం పరిధిలోని బావి పూర్తిగా శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో నేరుగా భవనాశి తటాకం నీటిని చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన తొట్టెల్లో నింపుతున్నారు. మొత్తం 18 తొట్టెల్లో అవకాశన్ని బట్టి చేప పిల్లలు/గుడ్లు వేసి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల మత్స్య అభివృద్ధి శాఖాధికారి రవీంద్ర తెలిపారు. దీనికిగాను సుమారు రూ.రెండు లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. ఏదేమైనా ఈసారి చక్రాయపాలెం కేంద్రంలో చేప పిల్లల పెంపకం ప్రారంభిస్తామని స్పష్టంచేశారు.

ఈనాడు కథనానికి స్పందన


చేప పిల్లల తొట్టెల్లో నింపిన నీరు

జేవీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల దేవాదాయశాఖకు చెందిన ఆలయాల ఆభరణాలు తనిఖీ అధికారి (జేవీవో)గా డి.శ్రీనివాసరావు శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008లో సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా, ఒంగోలు జిల్లా సహాయ కమిషనర్‌గా, తెనాలి వైకుంఠపురం దేవస్థానం లాంటి తదితర ఆలయాల్లో ఈవోగా పనిచేశారు. చివరిగా లాలాపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో గుంటూరు జోన్ జేవీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఈవోలు, సిబ్బంది జేవీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు



జ్వరంతో బాలిక మృతి

మార్టూరు, న్యూస్‌టుడే: నిత్యం పాఠశాలకు వచ్చి చలాకీగా ఉండే బాలిక ఒక్కసారిగా మృత్యువాత పడడం స్థానికులను, ఉపాధ్యాయులను కలిచివేస్తోంది. మండలంలోని ఇసుకదర్శికి చెందిన ముట్లూరి మేఘన (12) స్థానిక ఉన్నత పాఠశాలలో 6వ తరగతి అభ్యసిస్తోంది. రెండు రోజులుగా జ్వరంతో ఇబ్బందిపడుతున్న బాలికకు తల్లిదండ్రులు స్థానికంగా చికిత్స అందిస్తున్నా పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి కన్నుమూసినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. వాంతులు, విరోచనాలు, జ్వరం తదితర ఇబ్బందులతో చిన్నారి మృత్యువాత పడడం గ్రామంలో విషాదం అలుముకుంది. సమాచారం అందడంతో శుక్రవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. హెచ్‌ఎం ఎం.శైలజాలక్ష్మి, ఉపాధ్యాయులు బాలిక ఇంటికి వెళ్లి మేఘన తండ్రి సాంబశివరావు నుంచి వివరాలు తెలుసుకున్నారు.

కోటప్పకొండ ఈవోగా చంద్రశేఖర్

నరసరావుపేట అర్బన్ : రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లోగా భాగంగా నెల్లూరు జిల్లా మూలపేట నుంచి కోటప్పకొండకు ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్‌జీఎస్‌ఏ యాప్ 2024-25పై ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభమైంది. సీఈవో జ్యోతిబసు తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు విధిగా అమలు చేయాలని, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ పర్యవేక్షకులుగా హాజరైన ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్‌పీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు

కొత్త సర్కిళ్లకు ఎస్ఈల కేటాయింపు ఎప్పుడో?


గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: సెంట్రల్ డిస్కం పరిధిలో నరసరావుపేట, బాపట్లలో కొత్తగా సర్కిళ్లు ఏర్పాటు చేస్తూ ఆ సంస్థ సీఎండీ పి.రవి ఈనెల 22వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాలు జారీ చేసి ఐదు రోజులు గడిచినప్పటికీ పర్యవేక్షక ఇంజినీర్లను నియమించలేదు. దీంతో ఆ సర్కిళ్లు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆ రెండు సర్కిళ్లకు ఈఈలు, డిప్యూటీ ఈఈలను కేటాయించారు. అక్కడ ఎస్ఈ ఎవరూ లేనందున వారు ఎవరికి రిపోర్టు చేయాలో అర్థం కాక పాత పోస్టుల్లోనే కొనసాగుతున్నారు.

ఆలోచన మెరిసె.. ప్రతిభతో మురిసె

కొండమంజులూరు విద్యార్థిని చిత్రానికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం

కొండమంజులూరు (జే పంగులూరు), న్యూస్‌టుడే

గురువుల ఆలోచనలు.. సూచనలకు.. విద్యార్థి తన ఊహలకు ఊపిరి పోసింది.. ఫలితం.. చూడచక్కని చిత్రం రూపుదిద్దుకుంది.. అది జాతీయ స్థాయిలో మెరిసింది.. 'భవ్య'కు పట్టం కట్టింది.. ఇది మన జిల్లా విద్యార్థి విజయ గాథ. జేపంగులూరు మండలం కొండమంజులూరులోని శ్రీరావుల జానకీ రామయ్య జడ్పీ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న భవ్యశ్రీ.. తాజాగా జాతీయ స్థాయిలో ఓజోన్ పొర ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖ మోంట్రియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. ఆగస్టు 31న నిర్వహించిన పోటీల ఫలితాలను ఇటీవల న్యూదిల్లీలోని పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి భారతీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు అంతర్జాలంలో తాము గీసిన చిత్రాలు ప్రదర్శించగా భవ్యశ్రీ సత్తాచాటడంతో రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవం రోజున బాపట్ల కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం, రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు.


భవ్యశ్రీ గీసిన చిత్రం

కొండమంజులూరు గ్రామానికి చెందిన పంచుమర్తి రాజా, శ్రీలక్ష్మీలావణ్య ఇద్దరు సంతానంలో పెద్దకుమార్తె భవ్యశ్రీ. తల్లిదండ్రులు చేనేత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా చదువులో రాణిస్తూనే ఇతర పోటీల్లో ముందుంటుంది. గతేడాది తొమ్మిదో తరగతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానం, బాపట్ల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే సంవత్సరం ఆగస్టు 15న జరిగిన చిత్రలేఖనం పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించిందని, ఖాదీమహోత్సవ్ వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనిత తెలిపారు.

బొమ్మలు గీయడంలో ఆసక్తి

బొమ్మలు గీయడం ఆసక్తి. ఆరో తరగతి నుంచే గీస్తున్నా. 2019లో కొవిడ్ సమయంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై చిత్రాలు గీశా. తాజాగా ఓజోన్ పొర ప్రాధాన్యంపై పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నా. దీంతో పాటు డ్రాయింగ్ టీచర్ సూచనలతో బొమ్మ ఎలా ఉండాలో నేర్చారు. సైన్సు ఉపాధ్యాయులు ఓజోన్‌పొర, భూమి, సూర్యుడు తదితర అంశాల గురించి చెప్పారు. నాలుగు రోజులు శ్రమించా.. ఫలితంగా అద్భుతమైన బొమ్మ వచ్చింది. దీనికి జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రావటం సంతోషంగా ఉంది.

– పంచుమర్తి భవ్యశ్రీ



ఫిబ్రవరి నాటికి నిజరూప దర్శనం

- ప్రసన్నాంజనేయుడి దేవస్థానం సహాయ కమిషనర్ తిమ్మానాయుడు
- బాధ్యతల స్వీకరణ అనంతరం విలేకరులతో మాటామంతీ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌గా ఎం.తిమ్మానాయుడు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సహాయ కమిషనర్ టి.సుభద్రను గుంటూరు పట్టణం లాలాపేట దేవాలయానికి బదిలీ చేసిన సంగతి విదితమే. నూతన సహాయ కమిషనర్‌కు వేదపండితులు వంగల హరిశంకరావధాని, అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతల దస్త్రంపై సంతకం చేశారు. అర్చకులు ఆశీర్వదించారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్న సహాయ కమిషనర్ టి.సుభద్రను బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు.


సహాయ కమిషనర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

గుడికి ప్రభుత్వ భూములు అప్పగించాలని కోరతా..

మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న రాతి ముఖమండపం పనులను 2025 ఫిబ్రవరి నాటికి పూర్తిచేసి, స్వామి వారి నిజరూప దర్శనం భక్తులకు కలిగేలా చర్యలు తీసుకుంటానని సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. కొవిడ్ సమయంలో పది నెలల పాటు ఇక్కడ పనిచేశానన్నారు. అర్చకులు, సిబ్బంది, పట్టణ ప్రముఖుల సహకారంతో గుడి అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. భవిష్యత్తులో ఆలయాభివృద్ధిని కాంక్షిస్తూ పరిసరాల్లోని ఖాళీ ప్రభుత్వ భూముల్ని గుడికి అప్పగించాలని సర్కారును కోరనున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. పలువురు స్థానికులు అభినందించారు.

హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా తెన్నేటి

బాపట్ల, న్యూస్‌టుడే: కొత్తగా పార్లమెంటరీ కమిటీల్లో హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కొత్త కమిటీలను ప్రకటించారు. ప్రస్తుతం కృష్ణప్రసాద్ లోక్‌సభ ప్యానెల్ స్పీకర్‌గా ఉన్నారు. ఎంపీకి పలువురు అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యుడిగా తనను నియమించినందుకు స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాకు తెన్నేటి ధన్యవాదాలు తెలిపారు.


కృష్ణప్రసాద్, బాపట్ల ఎంపీ

ఉద్యోగ భద్రత కల్పించండి

- మంత్రి గొట్టిపాటికి పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సహాయకుల వినతి
- పొరుగు సేవల కింద పేర్ల నమోదుకు సొమ్ములు తీసుకున్నారని ఫిర్యాదు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పురపాలకంలో నాలుగేళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సహాయకులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎదుట మొరపెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం చిలకలూరిపేటలోని ఆయన స్వగృహానికి వెళ్లిన వీరు తమ భవితవ్యం గురించి వివరించారు. 2020లో కొవిడ్ సమయంలో పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులుగా 25 మంది, ఇంజినీరింగ్ సహాయకులుగా 13 మంది విధుల్లో చేరామన్నారు. నెలకు రూ.12 వేల జీతం ఇస్తున్నారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు విధుల్లో కొనసాగుతున్న తమను ఈ నెలాఖరు నాటికి తొలగిస్తామంటూ వారం రోజుల క్రితం పురపాలక కమిషనర్ ఆదేశాలిచ్చారన్నారు. దీంతో వారిలో ఆందోళన పెరిగింది. చిలకలూరిపేటలో మంత్రిని కలిసి తమ గోడు వినిపించారు. స్పందించిన మంత్రి పురపాలక మంత్రితో మాట్లాడి కొనసాగించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇక్కడ కార్మికుల అవసరం ఉందని, వీరిని కొనసాగించాలంటే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని పూర్వపు కమిషనర్ ఎం.సత్యనారాయణ గతంలో ప్రకటించారు.

పేర్ల నమోదు కోసం డబ్బుల వసూలు.. మంత్రి సీరియస్

కార్మికులు, ఇంజినీరింగ్ సహాయకుల పేర్లను పొరుగుసేవల కింద నమోదు చేయిస్తామంటూ కొందరు దిగువస్థాయి అధికారి వారి నుంచి నగదు వసూలు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు తీసుకున్నారని వారు వాపోతున్నారు. ఐదేళ్లు గడిచినా అది కార్యరూపం దాల్చలేదని మంత్రి ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. వారం రోజుల్లోపు కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులు కొంతమేర అధికారులు, మరికొంత పాలకమండలి సభ్యుల వద్ద ఉందని ఆ అధికారి మంత్రికి వివరించడం విశేషం.

డీజే మోత.. దాటుతోంది గీత

వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా చెరుకుపల్లి మండలం, పొన్నపల్లిలో యువకులు డీజే ఏర్పాటు చేశారు. ఊరేగింపులో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న 16ఏళ్ల బాలుడు డీజే నుంచి వెలువడిన శబ్దం..అధిక వైబ్రేషన్స్ కారణంగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే బాలుడిని గుళ్లపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా సరైన సమయంలో చికిత్స అందడంతో బాలుడు తిరిగి ఊపిరి పోసుకున్నాడు.

ఇదే ప్రాంతంలో మరో రోజు నిమజ్జనోత్సవంలో ఓ వృద్ధుడు యువకుల నృత్యాలను చూస్తూ అధిక శబ్దానికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స అనంతరం గుండెల్లో నొప్పి అనడంతో గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా గుండె నాళాలు రెండు మూసుకుపోయాయని వైద్యులు తెలిపారు. ఇలాంటి ఘటనలు ఒక్క చెరుకుపల్లి మండలంలోనే ఈ ఏడాది ఆరు చోట్ల జరగడం గమనార్హం.

నిజాంపట్నం మండలం కూచినపూడిలో వినాయక నిమజ్జనం సందర్భంగా డీజే శబ్దాలకు ఓ యువకుడు గుండె ఆగి మృతి చెందాడు.

- శ్రుతిమించిన శబ్దంతో తప్పుతోంది గుండె లయ
- దీర్ఘకాలిక వ్యాధులకూ కారకం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

పండగొచ్చిందంటే చాలు వినోదం కోసం నేడు డీజే ఏర్పాటు చేసి పెద్ద శబ్దాలతో పాటలకు నృత్యాలు చేయడం పరిపాటిగా మారింది. వినోదం కోసం వినియోగిస్తున్న ఈ డీజేల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాణాంతకంగా మారుతున్న ఈ డీజే శబ్దాల వల్ల దీర్ఘకాలంలో ప్రజలకు గుండె జబ్బులు, వినికిడి సమస్యలు వస్తున్నాయని, అనారోగ్య సమస్యలు తలెత్తి పిల్లలు, మహిళలు, వృద్ధులు త్వరగా బలహీనపడతారని వైద్యులు తేల్చిచెబుతున్నారు. డీజే బ్యాక్స్‌ల నుంచి వచ్చే అధిక శబ్దాలు మనిషి ఆరోగ్యంపై అనేక దుష్పరిణామాలు చూపుతాయని, వీటికి దూరంగా ఉండాలని నిపుణులు అంటున్నారు. నేడు డీజే వ్యాపారం జోరందుకుంది. దీంతో పల్లెలు..పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడ కావాలన్నా ఇవి అద్దెకు లభిస్తున్నాయి. వీటి వాడకంపై అదుపు ఉంచాలని, ప్రభుత్వం ఈ దిశగా కొత్త నిబంధనలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవి తెలుసుకుందాం

- సాధారణంగా మానవుని చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరించగలవు. 150 డెసిబుల్స్ వరకు శబ్దం వెళితే వినికిడి సమస్యలు వస్తాయి. కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. 150 డెసిబుల్స్‌కు మించి శబ్దం వింటే రక్తపోటు పెరిగి గుండె సమస్యలు వస్తాయి. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్స్ వల్ల శరీరంలో నాడీ వ్యవస్థ దెబ్బతిని మెదడుకు రక్తం సరఫరా తగ్గుతుంది. గుండెకు రక్తం అందించే నాళాలు మూసుకుపోయి గుండెకు రక్తం సరఫరా తగ్గి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.
- గర్భిణులు డీజే బాక్సుల నుంచి వెవడే అధిక శబ్దం వింటే గర్భస్థ శిశువు నిద్రకు విఘాతం కలుగుంది. తద్వారా పిండం పెరుగుదల, శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. బాలింత, నవజాత శిశువు చెవులకు అధిక శబ్దం చేరితే వినికిడి సమస్యలతో పాటు శరీరంలోని అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఎందుకంటే ప్రసవం తరువాత తల్లి, బిడ్డలో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో డీజే శబ్దాలకు గుండెపోటు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.





తీరంలో పరిస్థితి ఇది

గతంలో విందు, వినోద కార్యక్రమాలకు మైక్‌లను వినియోగించేవారు. వాటి వల్ల పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. మైక్ సెట్లను అద్దెకు ఇచ్చే వారు కూడా తక్కువ సంఖ్యలో ఉండేవారు. కానీ నేడు డీజే వాడకాలు పెరగడం..పెద్ద శబ్దాలకు నృత్యాలు చేయడం ఫ్యాషన్‌గా మారింది. దీనికి తోడు ఎక్కువ శబ్దం వినడం కూడా అలవాటుగా మారింది. వీటి వినియోగం పెరగడంతో మైక్‌సెట్లు అద్దెకిచ్చే స్థానంలో డీజే బాక్సుల అద్దె వ్యాపారం జోరందుకుంది. తీరంలో నిన్న మొన్నటి వరకు దాదాపు 350 మంది మైక్ సెట్ అద్దె వ్యాపారులుంటే నేడు వీరి స్థానంలో డీజే బాక్సుల అద్దె వ్యాపారం చేసేవారు దాదాపు 500 మందికిపైగా ఉన్నారు. ఈ రంగంలోకి కొత్తగా వచ్చేవారు ఏడాదికి 20 నుంచి 30 మంది పెరుగుతున్నారని వ్యాపారులు అంటున్నారు. ఎవరి వద్ద ఎక్కువ, పెద్ద శబ్దం వచ్చే డీజే బాక్సులు ఉంటే వారికే వ్యాపారంలో ప్రాధాన్యం ఉంటోంది.

పరిష్కార మార్గాలివే..

ప్రభుత్వం ఈ డీజే శబ్దం మానవాళికి ఇబ్బంది కలిగించని స్థాయిలో వినియోగించేలా కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బడి, గుడి, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. వీటిని ఎక్కడైనా ఒకచోట స్థిరంగా ఏర్పాటు చేసి వినియోగించేలా చూడాలి. వాహనాల్లో పెట్టి ఒకచోట నుంచి మరో చోటుకు శబ్దం చేసుకుంటూ వెళ్లే విధానాన్ని నిషేధించాలి. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు అంటున్నారు.

దుకాణంలో వస్తువులు నేలవాలాయి

వినాయక నిమజ్జనం సందర్భంగా ఒక రోజుకు రూ.80వేలు అద్దె చెల్లించే ప్రాతిపదికన తీసుకొచ్చిన భారీ డీజే బాక్సుల శబ్దానికి మా మందుల దుకాణంలో వస్తువులు, ఔషధాలన్నీ అల్మారాల నుంచి కింద పడిపోయాయి. వైబ్రేషన్‌కు గుండె దడదడలాడింది. పోలీసులు కూడా పట్టించుకోలేదు. ఈ సంస్కృతిని అడ్డుకోకపోతే గుండె జబ్బులు ఖాయం.

- శ్రీనివాసరావు, మందుల దుకాణదారుడు, చెరుకుపల్లి


గుండెపై ఒత్తిడి పెంచుతాయి

డీజే శబ్దాలకు బాలింతలు, గర్భిణులు దూరంగా ఉండాలి. చిన్నారులు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం పడుతుంది. డీజే బాక్సులకు దగ్గరగా ఉంటే బేస్ ఎక్కువైనప్పుడు వైబ్రేషన్స్ శక్తిమంతంగా వస్తాయి. ఇవి గుండెపై ఒత్తిడిని పెంచుతాయి. తద్వారా రక్తనాళాలు దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్లనే మరణాలు సంభవిస్తుంటాయి. ఒకవేళ ఎవరైనా ఈ శబ్దాలకు తట్టుకోలేక పడిపోతే వెంటనే సీపీఆర్ చేయవచ్చు. కానీ ఆ సమయంలో పడిపోయిన వ్యక్తి మద్యం మత్తులో ఉంటే సీపీఆర్ ప్రభావం చూపదు. మరణం సంభవిస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- డాక్టర్ జీవలత, పీహెచ్‌సీ, కనగాల

సీఎం సహాయ నిధికి రూ.30 లక్షల విరాళం

బాపట్ల: వరద బాధితుల సహాయార్థం బాపట్ల నియోజకవర్గ ప్రజలు సీఎం సహాయ నిధికి అందజేసిన రూ.30,00,681 విరాళాల చెక్కును సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం అందజేశారు. అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే నరేంద్రవర్మ కలిశారు. జిల్లా కేంద్రం బాపట్ల పట్టణంలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి రెండో చెరువు తవ్వకం కోసం వంద ఎకరాల భూసేకరణకు నిధులు మంజూరు చేయాలని సీఎంను ఆయన కోరారు. సూర్యలంకను జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. వరద బాధితులకు పరిహారాన్ని పెంచి సత్వరమే అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా పంట నష్టపోయిన రైతులకు వేగంగా పరిహారం అందిందన్నారు. నల్లమడ వాగును ఆధునికీకరించి లక్ష ఎకరాలకు నీరు, బాపట్ల పట్టణానికి ముంపు సమస్యను నివారించాలని కోరారు. కొమ్మమూరు కాలువ సహా కృష్ణా పశ్చిమ డెల్టాలో సాగునీటి కాలువల ఆధునికీకరణ పనులు వచ్చే వేసవిలో ప్రారంభించి కట్టలు పటిష్ఠం చేసి రైతులను ఆదుకోవాలన్నారు.


సీఎం చంద్రబాబుకు విరాళాల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కూలి సొమ్ము పెంచాలని డిమాండ్

బాపట్ల, న్యూస్‌టుడే: పౌరసరఫరాల గోదాముల్లో పని చేస్తున్న ముఠా కార్మికులు, హమాలీల కూలి సొమ్ము పెంచాలంటూ ఏఐటీయూసీ అనుబంధ ముఠా కార్మికుల సంఘం అధ్యక్షుడు తాతా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. కూలి సొమ్ము పెంచాలని కోరుతూ స్థానిక ఏపీ గిడ్డంగుల సంస్థ గోదాముల వద్ద కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కూలి పెంచలేదన్నారు. నిత్యావసర ధరలు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రతి ఏటా దసరాకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో బోనస్ ఇచ్చారని గుర్తు చేశారు. కార్మికులకు సమ వస్త్రాలు పంపిణీ చేయాలన్నారు. వైకాపా ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరిగిందని కనీసం తెదేపా కూటమి ప్రభుత్వం స్పందించి తమ సమస్య పరిష్కరించాలన్నారు. సంఘం కార్యదర్శి పులి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పర్వతరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి యేమినేని శివరామ్‌కుమార్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


స్త్రీ, పురుష సమానత్వానికి కృషి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : స్త్రీ, పురుష సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) రాష్ట్ర శిక్షణ కో-ఆర్డినేటర్ ఎం.హేమలత అన్నారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో స్త్రీ-పురుష సమానత్వంపై అవగాహన సదస్సు స్థానిక ఎన్జీవో హోంలో శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పలు రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించినా మహిళలకు సమానత్వం దక్కటం లేదన్నారు. మహిళల పట్ల అవమానాలు, హత్యలు దోపిడీలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక రక్షణ చట్టాలు చేస్తుందని, చట్టాల పట్ల మహిళలు అవగాహన పెంపొందించుకుని ముందుకు సాగాలన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ కె.ఉషారాణి, డీబీఆర్‌సీ కో-ఆర్డినేటర్ వి.ఎస్.వి భాస్కర్, న్యాయవాది కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఉదయభాస్కర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీబీఆర్‌సీ శిక్షణ సమన్వయకర్త హేమలత

దేశంలో కులగణన అత్యవసరం

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : దేశంలో అత్యవసరంగా కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ అన్నారు. స్థానిక డ్రైవర్స్‌కాలనీలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో జ్యోతిబా పులే సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కుల గణనతోనే సంక్షేమ పథకాల పక్రమ అమలు సాధ్యమని, రిజర్వేషన్లకు ఈ గణన ఎంతో కీలకమన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ మాట్లాడుతూ దళితులు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు శివ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

చేనేతకు శాశ్వత రక్షణ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అక్టోబరు 5న స్థానిక రైలుపేట చేనేత సహకార సంఘంలో జరగనున్న చేనేతకు శాశ్వత రక్షణ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యుడు మురుగుడు సత్యనారాయణ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ ఎన్నో ఏళ్లుగా సంక్షోభంలో ఉందని తెలిపారు. కార్మికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు లేరన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసి పరిశ్రమకు రక్షణ కల్పించాలని డిమాండు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. చేనేత కార్మికులు, నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ రాతి ముఖ మండప నిర్మాణానికి గుంటూరుకు చెందిన పెళ్లూరి రవికుమార్, సుభద్ర (పూర్వ సహాయ కమిషనర్) దంపతులు రూ.1.16 లక్షల చెక్కును శుక్రవారం అందించారు. కమిషనర్ ఎం.తిమ్మానాయుడు రసీదు అందజేశారు.


విరాళం అందిస్తు న్న ఏసీ దంపతులు

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండలంలో వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు సారా తయారీ కేంద్రాలపై పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు సర్కిల్ సీఐ బి.హరికృష్ణ నేతృత్వంలో వెదుళ్లపల్లి ఎస్సై పి.జనార్దనరావు చేసిన దాడుల్లో 36 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న బేతపూడి గ్రామానికి చెందిన కోట పోతురాజును అదుపులోకి తీసుకుని 2.50 లీటర్లు, నాలుగో గ్యాంగ్‌లో దేవరకొండ రమేష్ వద్ద 2.75 లీటర్లు, వృక్షనగర్‌లో ఇంటి వద్ద సారా కాస్తున్న ఎం.చిన్ని అనే మహిళను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవటంతో పాటు తయారీకి వినియోగించే 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కేసులు నమోదు చేశామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

పోలీసుల అదుపులో జూదరులు

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు శివారు గాంధీనగర్‌లోని ఓ రహస్య ప్రదేశంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని విశ్వసనీయ సమాచారం ఆధారంగా తన సిబ్బందితో కలిసి ఎస్సై ఏడుకొండలు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 40 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

అర్చక సేవా సంఘ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసమూర్తి



బాపట్ల, న్యూస్‌టుడే: అర్చక సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా మేడూరి శ్రీనివాసమూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. రాష్ట్ర అర్చక సేవా సంఘం నాయకుల ఆధ్వర్యంలో బాపట్లలో శుక్ర వారం ఈ ఎన్నిక నిర్వహించారు. శ్రీని వాసమూర్తి మాట్లాడుతూ అర్చకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రైవేటు ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు వేతనాలు చెల్లించేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌పై వ్యాసరచన పోటీలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై మండల స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో నీలం దేవరాజ్ ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆంధ్రప్రదేశ్, భారత దేశాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై పోటీలు జరిగాయని చెప్పారు. వి.మధునాగశ్రీవల్లి, జి.వర్షిణి (సూరేపల్లి, వెల్లటూరు, వ్యాసరచన, వక్తృత్వం), ఎస్.మేఘన (పెసర్లంక, వ్యాసరచన), ఎస్.నవ్య (సూరేపల్లి, వక్తృత్వం) విజేతలుగా నిలిచారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా గుర్రం మురళీమోహన్, కె.శివరామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చావలి దారిలో బూడిద కష్టాలు



వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలు - చుండూరు మార్గంలో చావలి వద్ద రోడ్డు పక్కన చెత్త పారబోస్తున్నారు. దాన్ని డంపింగ్‌యార్డుకు తరలించకుండా అక్కడ ఉంచి నిప్పంటించి వ్యర్థాలను బూడిద చేస్తున్నారు. గాలి వీచినప్పుడు బూడిద ఎగిరి ఆ దారిన వెళ్లే నడకదారులు, వాహన చోదకుల కళ్లలో పడుతోంది. దీని వల్ల చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అక్కడ వ్యర్థాలు కాల్చకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ శేఖర్‌ను సంప్రదించగా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, చెత్త గుట్టలు అక్కడ నిల్వ ఉండకుండా చేడాలని సూచిస్తామన్నారు. వ్యర్థాలు తగలబెట్టకుండా చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, వేమూరు**

గుంతలతో ప్రయాణానికి చింత



బాపట్ల - సూర్యలంక రోడ్డులో విజయలక్ష్మీపురం మొదటి లైన్‌కు వెళ్లే మార్గంలో తారు రహదారిపై గొయ్యి ఏర్పడింది. వేగంగా వస్తున్న వాహనాలు గుంతలో పడి దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా సూర్యలంక రోడ్డులో గుంతలను త్వరలో పూడ్చించి మరమ్మతులు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**

ఆదమరిస్తే అపాయమే



కర్లపాలెం- గణపవరం ప్రధాన రహదారిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణం సాగిస్తాయి. ఈ రహదారి వైఎస్సార్ నగర్ సమీపంలో కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ఆదమరిస్తే పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోయే అవకాశం ఉంది. రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గుంతలో పడి గాయాలపాలైన సంఘటనలున్నాయి. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును సంప్రదించగా గుంత పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కర్లపాలెం**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? కొల్లూరు లాకుల కూడలి వద్ద నుంచి ఎన్టీఆర్ పార్కు, కరకట్టపై ఉన్న బస్టాండు వరకు నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగక పోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి వేళల్లో రాక పోకలు సాగించే వారికి ఇబ్బందిగా మారింది. **- సూర్యదేవర సుధాకరరావు, కొల్లూరు**

✔ వెంటనే వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి, కొల్లూరు**

– న్యూస్‌టుడే, కొల్లూరు

? చెరుకుపల్లి కాపుల బజారులో పారిశుద్ధ్యం లోపించింది. వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీళ్లు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **- పూల సాంబశివరావు, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బంది కొరత కారణంగా కొంత జాప్యం జరిగింది. వెంటనే సిబ్బందిని పంపి పారిశుద్ధ్యం మెరుగయ్యేలా చర్యలు చేపడతాం. **- టి.మురళీకృష్ణ , పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి**

– న్యూస్‌టుడే, చెరుకుపల్లి

? చందోలు శ్రీ నీలి బంగారయ్య జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిపై నీరు నిల్వటంతో విద్యార్థులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి. **- సుబ్బారావు, చందోలు**

✔ రహదారిపై గుంతలు ఏర్పడటంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. సిబ్బందిని పంపి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. **- శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి, చందోలు**

– న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

? పేరలి పంచాయతీ పరిధిలో మల్లెలవారిపాలెం, బక్కవారిపాలెం, మేకలవారిపాలెంలో 20 రోజులుగా వీధిదీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. **- స్థానికులు**

✔ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. రాత్రిళ్లు మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- సువర్చల, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కర్లపాలెం

? సమస్య: రేపల్లె 19వ వార్డులో ఓ విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన వీధి దీపం పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతోంది. **- సాంబశివరావు, స్థానికుడు**


✔ తక్షణం పరిశీలించి పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **- రోహిణి, మున్సిపల్ ఏఈ, రేపల్లె**

– న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

పంట కాల్వలు కట్టేయురూ!

పొలాల్లోకి పొర్లుతున్న నీరు

న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం



కోమలి వద్ద పొలాల్లోకి పొర్లుతున్న కోమలి బ్రాంచి కాల్వ నీరు



ముంపులోనే పొలాలు

వారం రోజుల క్రితం పంట కాల్వల్లో చాలినంత నీటి సరఫరా లేక బీటలు వారిన పొలాలు మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగాయి. పంట కాల్వలో నీటి సరఫరా పూర్తి స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజిన్ల సాయంతో పొలాలకు నీరు పెట్టారు. రైతుల వినతితో అధికారులు అరమండ్ల ఛానల్, కోమలి బ్రాంచి కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేశారు. ఆ తర్వాతి రోజు నుంచే భారీ వర్షాలు కురవడంతో పొలాలు నీట మునిగాయి. మూడ్రోజులుగా రాత్రి వేళ కురుస్తున్న వర్షాలకు కోమలి, భవనంవారిపాలెం, సంగుపాలెం, కోడూరు పొలాల్లో పైరు ఇంత వరకు బయట పడలేదు. అరమండ్ల ఛానల్ పరిధిలో భవనంవారిపాలెం, సంగుపాలెం పొలాలు చివరి ఆయకట్టుగా ఉన్నాయి. అలాగే కోమలి బ్రాంచి కాల్వలకు చివరి ఆయకట్టుగా కోమలి, సంగుపాలెం, కోడూరు పొలాలు ఉన్నాయి. చివరి ఆయకట్టు పొలాలు కావటంతో ఈ కాల్వల పరిధిలోని పొలాలు పూర్తిగా నీట మునిగి మూడ్రోజులైనా ఇంత వరకు పైరు బయటపడలేదు. పంట కాల్వల కట్టలు పొర్లి నీరు పొలాల్లో చేరుతోంది. పంట కాల్వల్లో నీటి సరఫరా తగ్గితేనే పొలాల్లో నీరు బయటకు పోతాయని రైతులు తెలిపారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ డీఈ రామ్మూర్తి దృష్టికి తీసుకెళ్లగా పంట కాల్వల్లో నీటి మట్టం పూర్తిగా తగ్గిస్తామని రైతులకు సమస్య లేకుండా చూస్తామన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



గ్లోరియా, ఆర్డీవో

బాపట్ల, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తానని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవోగా ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జీఏడీకి గంధం రవీందర్: జిల్లా ఆవిర్భావం తర్వాత బాపట్ల డివిజన్ తొలి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన గంధం రవీందర్ ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గ ఆర్వోగా వ్యవహరించారు ఆర్డీవోల రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్ట్ చేయాలని సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.


రేపల్లె కార్మిక సంక్షేమ అధికారి బాధ్యతల స్వీకరణ



ప్రభాకరరావు

రేపల్లె అర్బన్: రేపల్లె కార్మిక సంక్షేమశాఖ అధికారిగా జి.ప్రభాకరరావు ఉద్యోగ బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. గుంటూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తెనాలి కార్మిక సంక్షేమ అధికారి వినయ్‌కుమార్ ఇప్పటి వరకు ఈ స్థానంలో ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహించారు.

బాపట్ల టీపీవోగా మల్లికార్జునరావు



బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారిగా మల్లికార్జునరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణ ప్రణాళిక ఆర్‌డీడీ కార్యాలయంలో పని చేస్తున్న ఆయన బదిలీపై బాపట్ల వచ్చారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాల ప్రణాళికలను నిబంధనల ప్రకారం సత్వరమే అనుమతులు జారీ చేస్తామన్నారు.

చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా రాజేంద్ర

చెరుకుపల్లి న్యూస్‌టుడే: చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా కె.రాజేంద్ర ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా దర్శి నుంచి ఇక్కడకు బదిలీ కాగా ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన బీమాబాయి పిడుగురాళ్ల బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రను పలువురు దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేశారు. దస్తావేజు లేఖర్ల సంఘం నాయకుడు రావూరి ఆంజనేయులు ఆయనకు పూలమాల వేసి సత్కరించారు.

బాపట్లకు జాన్ మోహన్‌కుమార్.. బాపట్ల: బాపట్ల సబ్ రిజిస్ట్రార్‌గా జాన్ మోహన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పెదకాకాని నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పని చేసిన శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా దర్శికి బదిలీ అయ్యారు.

బండ్లమ్మ ఆలయం ఈవోగా నాగేశ్వరరావు

చందోలు (పిట్టలవానిపాలెం): చందోలు సమూహ ఆలయాలైన శ్రీబండ్లమ్మ, చెన్నకేశవస్వామి దేవస్థానాలు, శ్రీలింగోద్భవ క్షేత్రం ఈవోగా కె.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మోదుకూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈవోగా ఉన్న ఘంటసాల నరసింహమూర్తి చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి వెళ్లారు.

బాపట్ల డిప్యూటీ తహసీల్దారుగా సలీమా

బాపట్ల పట్టణం: బాపట్ల మండల డిప్యూటీ తహసీల్దారుగా షేక్ సలీమా నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ డీటీగా పనిచేస్తున్న కె.శ్రీదేవి కర్లపాలెం బదిలీ కాగా కర్లపాలెం మండలంలో డీటీగా పనిచేస్తున్న సలీమా బదిలీపై రానున్నారు.

కొత్త ఎంపీడీవోలు కొలువుదీరారు

పిట్టలవానిపాలెం, అమృతలూరు, కొల్లూరు: పిట్టలవానిపాలెం, అమృతలూరు, కొల్లూరు మండలాలకు ఎంపీడీవోలుగా ఐ.సత్యనారాయణ, మారుతి శేషమాంబ, ఎన్.నరసింహారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వారికి ఆయా కార్యాలయాల ఈవోపీఆర్డీలు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి సాదర స్వాగతం పలికారు.

సత్తాచాటిన బాల, బాలికలు



వేమూరు: క్రీడాకారులతో జిల్లా వ్యాయామ విద్య కార్యదర్శి కరీముల్లా, వ్యాయామోపాధ్యాయులు



భట్టిప్రోలు: టీఎంరావు పాఠశాల బాలికలతో ఉపాధ్యాయులు

వేమూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేమూరు మండలం పెరవలి ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17, బాలబాలికల వాలీబాల్, ఖోఖో, చదరంగం జట్ల ఎంపిక జరిగింది. ఈ పోటీల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పీఈటీ బుచ్చిరెడ్డి తెలిపారు. క్రీడాకారులకు జిల్లా వ్యాయామ విద్య కార్యదర్శి కరీముల్లా అభినందనలు తెలిపారు. భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాల క్రీడాకారిణులు జిల్లా జట్లకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. సూరేపల్లి వీపీఅండ్ జీఎస్ఎం పాఠశాల నుంచి ఎంపికైన వారిని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసశర్మ అభినందించారు.

చెరుకుపల్లి విద్యార్థుల ప్రతిభ

చెరుకుపల్లి: రేపల్లె నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో చెరుకుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపి పలు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. రేపల్లె మాంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో చెరుకుపల్లి పాఠశాల విద్యార్థి ఎ.దీపక్ అండర్ -14 విభాగంలో లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్‌లలో ప్రథమ, డిస్కస్‌త్రో, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచాడు. టి.ఉమ లాంగ్‌జంప్, హైజంప్, 600మీటర్ల పరుగులో ప్రథమ, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించింది. అండర్ -17 విభాగంలో పి.వర్ష, పి.లీలామోహన్, సీహెచ్ మహీచరణ్ 200, 600, 1500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. వారిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ కాటూరి శ్రీనివాసరావును ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మీనారాయణ అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు పెద్దవరం విద్యార్థిని



లక్ష్మిసాయి

నగరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో పెద్దవరం పాఠశాల విద్యార్థిని అద్దంకి లక్ష్మిసాయి అండర్ 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుని జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయింది. ఆమెను ప్రధానోపాధ్యాయులు బదరి నారాయణ, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

గడియార స్తంభానికి మరమ్మతులు

బాపట్ల: పట్టణంలోని గడియార స్తంభానికి పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్ శుక్రవారం మరమ్మతులు చేయించారు. గత రెండేళ్లుగా గడియార స్తంభంలో గడియారాలు పని చేయటం లేదు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కమిషనర్ స్పందించి మూడు గడియారాలకు మరమ్మతులు చేయించారు. మరో గడియారానికి చెన్నై నుంచి సాంకేతిక నిపుణులను పిలిచి మరమ్మతులు చేయిస్తామని ఆయన తెలిపారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ మార్గ్‌లో చంద్రకళా పార్కు శివారున రహదారిపై నిలిచిన నీటిని తొలగించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

రోడ్డుపై నీరు తోడివేత

నగరం: భారీ వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలు, రహదారులు ముంపునకు గురైన సంగతి తెలిసిందే. దీనిపై ఈనెల 27న 'ముంచెత్తిన వర్షం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి చినమట్లపూడి గ్రామంలో అనగాని సత్యప్రసాద్ యువత స్పందించింది. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి మసీదు మలుపు వరకు నాలుగడుగుల మేర వర్షం నీరు గత రెండు వారాలుగా తిష్టవేసింది. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు జలదిగ్బంధం కావడంతో రాకపోకలకు స్థానికులు నానా ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వ అధికారులు స్పందించక పోవడంతో గ్రామంలో కరీముల్లా షేక్ నేతృత్వంలో యువత మోటార్లు ఏర్పాటు చేసి పది గంటలు శ్రమించి రోడ్డుకు రూపు తెచ్చారు. దీంతో విద్యార్థులు, మహిళలకు రాకపోకలకు అనుకూలమైంది. యువకులను వారు అభినందించారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

అమృతలూరు: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల నష్టపరిహారం ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు ఏవో లోకేశ్వరి తెలిపారు. పంటనష్టం జాబితాలో పేర్లు ఉండి బ్యాంకు ఖాతాలో నగదు జమ కాని రైతులు బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాకు ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు.

గుళ్లపల్లిలో వైకాపా నేతల సమావేశం



నాగార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ కేశవతి, చిత్రంలో డాక్టర్ గణేష్

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): జిల్లా వైకాపా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన మేరుగు నాగార్జున రేపల్లె వైకాపా బాధ్యుడు ఈవూరి గణేష్‌తో గుళ్లపల్లిలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈఎస్ఆర్ వైద్యశాలలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. గణేష్ సతీమణి డాక్టర్ కేశవతి నాగార్జునకు పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ ఆదేశాల మేరకు నడుచుకోవాలని నూతన అధ్యక్షుడు నేతలకు సూచించినట్లు తెలుస్తోంది.

అవీ ఇవీ

భగవద్గీత పుస్తకాల ఆవిష్కరణ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ప్రపంచ మానవాళికి మార్గదర్శి అయిన భగవద్గీత పుస్తకాలను తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. జిల్లా కార్యనిర్వహణ అధికారి ఇ.అమ్మడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భగవద్గీత పఠనం చేస్తే మంచి మార్గంలో నడుస్తారని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని వివరించారు. కార్యక్రమంలో ధార్మిక మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, పాఠశాల కరస్పాండెంట్ ఎం.పి.వెంకట్రావు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు రాజీలేని పోరాటం

బాపట్ల, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తోట సుధాకర్ ప్రసాద్ రాజీలేని పోరాటం చేశారని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సురేష్‌బాబు అన్నారు. కలెక్టరేట్లో సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి ఓంకార్, బాపట్ల పట్టణాధ్యక్షుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 23 మంది ఎంపిక

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ముఖాముఖికి 64 మంది హాజరయ్యారు. మూడు కంపెనీల్లో ఉద్యోగాలకు 23 మందిని ఎంపిక చేశామని వైస్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, కంపెనీల ప్రతినిధులు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అమృతలూరు: అమృతలూరులో గొట్టిపాటి పూర్ణకుమారి, గంగాధర్ దంపతులు, తెనాలి శ్రీచక్ర వైద్యశాల సంయుక్త సహకారంతో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వైద్యులు మిథునేశ్వర్‌రెడ్డి, హరీష్, ప్రియాంక 250 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజు ప్రారంభించారు. దాతలు, దొడ్డపలనేని సుధీర్, మండవ రత్నప్రసాద్, వీరగంధం శ్రీను, షేక్ మౌలాలి, కైతేపల్లి రాంబాబు, చిలువోల్లంక రామచంద్రరావు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

వేమూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వేమూరులో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 55మంది జాబ్ మేళాకు హాజరు కాగా వారిలో 19మందిని వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారు.

పర్యాటకంతో విజ్ఞానం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పర్యాటక ప్రదేశాలను సందర్శించి చారిత్రక ఆధారాలు తెలుసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చరిత్ర అధ్యాపకుడు ఎం.దాసు సూచించారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మెరుగైన సేవలందించాలి

కర్లపాలెం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరై ప్రజలకు మెరుగైన సేవ లందించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : మండలంలో పలు సమస్యల పరిష్కారానికి కార్మికులు సమష్టి కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ పేర్కొన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సీఐటీయూ మండల మహా సభలో అంగన్‌వాడీ, ఆశా, ఆటో, భవన నిర్మాణ, వీఆర్ఏ గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. మణిలాల్ మాట్లాడుతూ మండల పరిధిలో రొయ్యలు ఒలిచే మహిళా కార్మికులు, ఇతర అసంఘటిత రంగంలో ముఠా కార్మికుల సమస్యలపై భవిష్యత్తులో పోరాటం నిర్వహిస్తామన్నారు. అనంతరం సీఐటీయూ కమిటీ ఎన్నిక జరిగింది.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అమృతలూరు, న్యూస్‌టుడే: మూల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లూరు బసవయ్య, ఆవుల ప్రకాశరావు జ్ఞాపకార్థం రామోజీ సంస్థల అధినేత రామోజీరావు స్మారక కమిటీ ఆర్థిక సహకారంతో గూడవల్లికి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల సిబ్బంది 170మంది విద్యార్థులకు కంటిపరీక్షలు జరిపారు. కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, కొల్లూరు బాలకృష్ణ, పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

నిజాంపట్నం, న్యూస్‌టుడే : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. ఆముదాలపల్లి పంచాయతీలో అంతర్గత వీధుల్లో పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి స్రవంతి, తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



ఈనాడు మీతోడు

ఈనెల 28వ తేదీ శనివారం ఈనాడు ఆధ్వర్యంలో 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో **ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్** పాల్గొని ప్రయాణికులు ప్రస్తావించే సమస్యలకు సమాధానాలు ఇస్తారు. ప్రయాణికులు ఫోన్ చేసి తెనాలి డిపో పరిధిలో బస్సుల రాకపోకలు, ఇతర సమస్యలను ప్రస్తావించొచ్చు. సూచనలు, సలహాలు తెలియజేయొచ్చు.

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు: 99592 25422, 80085 73125

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

సస్యరక్షణ చర్యల్లో అప్రమత్తత అవసరం

అంబడిపూడి (బల్లికురవ), న్యూస్‌టుడే: మాగాణి సాగు చేసిన రైతులు నీటి యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్య రక్షణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎస్.వి.పి.కుమారి అన్నారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా అంబడిపూడిలో రైతులు సాగు చేసిన మాగాణి భూముల వెంత శుక్రవారం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? సోపిరాల నుంచి చినగంజాం సచివాలయం-2కు వెళ్లే సిమెంటు రోడ్డు పక్కన తుమ్మచెట్లు పెరిగాయి. కొమ్మల వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

✔ పరిశీలించి పంచాయతీ సిబ్బందిని పంపి కొమ్మలు తొలగిస్తాం. -అల్ల మస్తాన్‌రావు, గ్రామ కార్యదర్శి, చినగంజాం

– న్యూస్‌టుడే, చినగంజాం

నేడు స.హ. చట్టంపై సదస్సు

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంపై సంతమాగులూరులో శనివారం ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది సదస్సుకు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి గంధ మహోత్సవం

చీరాల, న్యూస్‌టుడే: చీరాల వైకుంఠపురంలో ఉన్న హజరత్ సయ్యద్ కరీ ముల్లాషా ఖాదరి వారి 53వ గంధ ఉరుసు మహోత్సవం ఈనెల 28 నుంచి అక్టోబరు ఒకటి వరకు జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాధ్యతగా పనిచేయండి.. పేరు తీసుకురండి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా పురపాలక సంఘానికి వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై కొత్త ఉద్యోగులు వచ్చారు. వీరు ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావును ఆయన ఛాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరు బాధ్యతగా పనిచేసి పురపాలక సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తనను కలిసిన ఉద్యోగులకు ఛైర్మన్ హామీ ఇచ్చారు.

29న స్వర్ణలో వైద్యశిబిరం

కారంచేడు(మార్టూరు): మండలంలోని స్వర్ణలో ఈనెల 29న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. డాక్టర్ రమేష్ ఆసుపత్రి, ఏలూరి ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభిస్తారన్నారు. దీనిలో ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు (బర్డ్ ఆసుపత్రి) జి.జగదీశ్, స్త్రీల వైద్యనిపుణురాలు ఎన్.అనిత, సీనియర్ గుండె వైద్య నిపుణుడు ఎల్.రామారావు, డాక్టర్ బాలభాస్కర్, అరుణ్, రాజు వంటి వైద్యులు అన్నిరకాల జబ్బులకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. గ్రామీణప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కారంచేడు(మార్టూరు): వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారిపై కారంచేడు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ విస్తృతంగా నిర్వహించారు. ఎస్సై వెంకట్రావు నేతృత్వంలో పర్చూరు-చీరాల మార్గం ప్రయాణించే వాహనదారుల నుంచి ధ్రువపత్రాలను పరిశీలించి, సూచనలు చేశారు. సరైన పత్రాలు, నంబరు బోర్డు లేని వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై తెలిపారు. తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు.

పాఠశాల పరిశీలన

మార్టూరు, న్యూస్‌టుడే: బొబ్బేపల్లి ఉన్నత పాఠశాలను శుక్రవారం చీరాల ఉప విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించి సంఖ్యను పెంచాలని ఆయన కోరారు.

వెలుగులు విరజిమ్ముతున్నాయ్..

చీరాల, న్యూస్‌టుడే



జిల్లాలోనే ముఖ్యమైన వాణిజ్య ప్రాంతం. పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారితో ప్రధాన రహదారులు సందడిగా ఉంటాయి. రాత్రి సమయంలో ఇంకా రద్దీ. గత ప్రభుత్వ పాలనలో వీధి దీపాలు వెలగక అనేక ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. అన్ని చోట్ల వీధి దీపాలు ప్రాధాన్యక్రమంలో పూర్తిచేశారు. దీంతో పట్టణం వెలుగులు చిమ్ముతోంది.

పట్టణంలో మామూలు దీపాలు 4,365, సెంట్రల్ లైట్లు 455 ఉన్నాయి. అదేవిధంగా ప్రధాన కూడళ్లయిన గడియార స్తంభం, కారంచేడు గేటు, ముంతావారి కూడలిలో ఐమ్యాక్స్ దీపాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వీధి దీపాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. నిర్వహణ సరిగా లేకపోవటంతో అక్కడక్కడ మిణుకుమిణుకు మంటూ వెలుగుతుండేవి. ఐమ్యాక్స్ ఇతర లైట్లు మరమ్మతులకు గురైతే ఇక అంతే సంగతులు.. వాటిని బాగు చేయటానికి ప్రత్యేక వాహనం లేకపోవటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.



చీకట్లో ఆర్వోబీ (పాత చిత్రం)

రూ. 37 లక్షలతో కొని..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ.37 లక్షలతో హైడ్రాలిక్ లేడరన్ను(శక్తిమాన్) కొనుగోలు చేశారు. దీనిద్వారా బల్బులు మార్చటం, మరమ్మతులు సులువయ్యాయి. మరో రూ.6లక్షలతో విద్యుత్తు సామగ్రి కొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య సూచనలతో అధికారుల పర్యవేక్షణలో పనులు వేగం అందుకున్నాయి. ఏయే వార్డుల్లో దీపాలు వెలగటంలేదో గుర్తించి, బల్బులు మార్చారు. అదేవిధంగా కొన్ని నెలలుగా ఆర్వోబీపై చీకటి రాజ్యమేలుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విద్యుత్తు దీపాలను మార్చటంతో పాటు స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేశారు. ఫలితంగా ఆర్వోబీపై విద్యుత్తు వెలుగులు చిమ్ముతున్నాయి. వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పట్టణంలో విద్యుత్తు కాంతులు వెదజల్లుతున్నాయి.

ఆర్వోబీపై లైట్లు ఆకట్టుకుంటున్నాయి

గతంలో ఆర్వోబీపై రావాలంటే చీకటితో ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం దీపాలు ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. కాంతి బాగుంది. ఇదే విధానాన్ని కొనసాగించాలి.

– పి.సాంబశివరావు, పట్టణవాసి

ఫిర్యాదు వస్తే తక్షణం స్పందిస్తాం

పట్టణంలో ఎక్కడైనా వీధిదీపాలు వెలగటం లేదని ఫిర్యాదు వస్తే వెంటనే స్పందిస్తున్నాం. సామగ్రితో పాటు అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయి. సిబ్బంది పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు.

– చక్రవర్తి, కమిషనర్

పంట ఉత్పత్తుల విక్రయాలపై అవగాహన ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న లాం శాస్త్రవేత్త శ్రీనివాసరావు తదితరులు

మార్టూరు, న్యూస్‌టుడే: రైతులు సాగులో సస్య రక్షణ చర్యలతో పాటు పంట ఉత్పత్తులను తగిన ధరకు విక్రయించేందుకు అవగాహన ఉండాలని గుంటూరు లాం శాస్త్రవేత్త శ్రీనివాసరావు కోరారు. మండలంలోని బొల్లాపల్లిలో శుక్రవారం రైతు సంఘం నేతల ఆధ్వర్యంలో వరి, మొక్కజొన్న సాగు, మార్కెటింగ్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ అగ్రికల్చర్ అధ్యక్షురాలు విజయనిర్మల మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువు సాగు చేసుకోవాలన్నారు. కేవీకే దర్శి శాస్త్రవేత్త జి.రమేశ్ మాట్లాడుతూ ప్రస్తుతం 120 రోజుల కాలపరిమితి ఉన్న వరి రకాలను సాగు చేయాలన్నారు. శాస్త్రవేత్తలు రాధాకృష్ణ, ఉష, ఏడీఏ కేవీ.శ్రీనివాసరావు, ఏవో వి.కిరణ్‌కుమార్, రైతు సంఘ నేతలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పది మంది అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే : ధర్మవరంలో ఈనెల 14న జరిగిన సంఘటనలో వైకాపాకు చెందిన పది మంది నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ పి.కృష్ణయ్య తెలిపారు. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా వైకాపా శ్రేణులు కర్రలు, కత్తులతో కారప్పొడి చల్లి తెదేపా శ్రేణులపై దాడి చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

వేటపాలెం: రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సంతరావూరు రైల్వేగేటు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... తుపాను పేటకు చెందిన షేక్ మల్లిక(32) నాలుగేళ్ల క్రితం భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బీడీలు చుడుతూ పిల్లలను పోషించుకుంటోంది. ఏమైందో తెలియదు కానీ ఆమె రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని చీరాల వైద్యశాలకు తరలించి, జీఆర్పీ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మార్టూరు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. జాతీయ రహదారి మీదుగా ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఒంగోలు నుంచి మార్టూరు వైపు ప్రయాణిస్తున్న వ్యక్తి కోనంకి సమీపంలో వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెల్లడించారు.

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: చీరాల- కారంచేడు మార్గంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన ఎం.నాగరాజు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి చీరాల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఇది జరిగినట్లు చెప్పారు. తలకు తీవ్ర గాయమైన క్షతగాత్రుడిని 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.



వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన చక్రాయపాలెం విద్యార్థిని అమృత

మండల స్థాయి పోటీల్లో విజేతలు వీరే

అద్దంకి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 పోటీల్లో విజేతలను ఎంఈవోలు శుక్రవారం ప్రకటించారు. చక్రాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అద్దంకి అమృత వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాసరచనలో గొరకాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యర్రమోతు లక్ష్మి, బృంద డిబేట్‌లో శింగరకొండ గురుకులం విద్యార్థినులు సీహెచ్.నవ్యశ్రీ, పి.చైతన్య వరలక్ష్మి నిలిచారు. వీరిని ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, చక్రాయపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ.శ్రీనివాసరావు అభినందించారు.

చెరువులు, కాలువల మరమ్మతులు ప్రారంభం

అద్దంకి, బల్లికురవ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం కోసం చెరువుల నుంచి కాలువల మరమ్మతులు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు చెరువుల పరిధిలో సుమారు రూ.6 లక్షల స్థానిక నిధులతో పూడిక తీత పనులు చేపట్టినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ఎం.మధుసూదన్ తెలిపారు. మూడేళ్లుగా కాలువల మరమ్మతులు విస్మరించడంతో సాగుకు అవకాశం లేకుండా పోయింది. ఈక్రమంలో అద్దంకి మండలం కలవకూరు చెరువు నుంచి శింగరకొండ పాలెం, కొత్తరెడ్డిపాలెం, శంఖవరప్పాడు గ్రామాల్లోని 400 ఎకరాలకు నీటిని అందించే కాలువ పూడిక తీత పనులను నీటి సంఘం పూర్వ అధ్యక్షుడు చింతా వెంకటేశ్వరరెడ్డి నేతృత్వంలో శుక్రవారం చేపట్టారు. భవనాశి తటాకంలో 4.5 కి.మీ. మేర కాలువ పూడిక తీత పనులు ప్రారంభించారు. గోపాలపురం, తిమ్మాయపాలెం, రామాయపాలెం, ఉత్తర, దక్షిణ అద్దంకి, వేలమూరిపాడు గ్రామాల రైతులకు ఈ కాలువ ద్వారా నీటి సదపాయం కలుగుతుంది. బల్లికురవ, సంతమాగులూరు చెరువుల నుంచి పొలాలకు వెళ్లే కాలువ పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నట్లు ఏఈ తెలిపారు. చేపల పెంపకం నిర్వహించిన వేలం ద్వారా సమకూరిన నిధులతో ఈ పనులు జరిపిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి ఇద్దరు గుత్తేదారులకు రూ.11 లక్షల నిధులు చెల్లించాల్సి ఉందన్నారు.

భక్తుల మనోభావాలు కాపాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: తిరుమల భక్తుల మనోభావాలు కాపాడాలంటూ కూటమి నేతలు నిరసన తెలిపారు. పర్చూరు బొమ్మల కూడలిలో శుక్రవారం లడ్డూ అపవిత్రత వ్యవహారం తేల్చాలని ప్రదర్శన చేపట్టారు. నిందితులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన, తెదేపా, భాజపా నేతలు పాల్గొన్నారు.

నేడు నాగులపాడుకు మంత్రి గొట్టిపాటి రాక

నాగులపాడు(అద్దంకి), న్యూస్‌టుడే: మండలంలోని నాగులపాడు గ్రామానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం రానున్నారు. గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం జరగనుంది. ఏటా మాదిరి ఈసారి భారీ ఆర్భాటాలతో విగ్రహ నిమజ్జనం జరపనున్నట్లు తెదేపా నేత కరి పరమేష్ వెల్లడించారు. భక్తులు, ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అర్చక సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసమూర్తి

బాపట్ల: అర్చక సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా మేడూరి శ్రీనివాసమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అర్చక సేవా సంఘం నాయకుల ఆధ్వర్యంలో బాపట్లలో శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ అర్చకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

చందలూరు(జే పంగులూరు): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి వ్యక్తి అందులో భాగస్వాములు కావాలని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు అన్నారు. బడి ఆవరణలో మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు.

కొత్త అధికారులు

సంతమాగులూరు ఎంపీడీవోగా జ్యోతిర్మయి



సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా జీఎస్‌కేఎన్‌వీ.జ్యోతిర్మయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన లక్ష్మీదేవి పెదనందిపాడుకు బదిలీ అయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల సబ్ రిజిస్ట్రారుగా వి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా వెంకటగిరి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న గంధం రాధాకృష్ణమూర్తి బదిలీపై బట్టిప్రోలు వెళ్లారు.



పూజల్లో సబ్‌రిజిస్ట్రార్ నవకుమార్


అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమితులైన అద్దంకి నవకుమార్ శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో పనిచేస్తున్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో అద్దంకి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ షేక్ అబ్దుల్‌రహమాన్ చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు. తొలుత నవకుమార్ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని పలు ఆలయాలను సందర్శించారు. వెంట విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, పొన్నపల్లి బ్రహ్మానందం తదితరులు ఉన్నారు.

వెలుగు ఏపీఎంలు..



రాజారావు (బల్లికురవ)

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: మండల వెలుగు ఏపీఎంగా తూమాటి రాజారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా డీఆర్‌డీఏ పరిధిలో పెన్షన్, బీమా విభాగాల్లో పనిచేస్తున్న ఈయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బల్లికురవ మండలానికి కేటాయించారు. ఆమేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు సిబ్బంది అభినందించారు.



హనుమంతరావు (సంతమాగులూరు)

సంతమాగులూరు, న్యూస్‌టుడే: మండల వెలుగు ఏపీఎంగా హనుమంతరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాగులుప్పలపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన మస్తానరావు నిజాంపట్నంకు బదిలీ అయ్యారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, న్యూస్‌టుడే: యువతను పట్టి పీడిస్తున్న హెచ్ఐవీ/ఎయిడ్స్, మాదకద్రవ్యాలపై యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి బీవీ.సాగర్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, రాయల్ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 'మీకు తెలుసా' గోడపత్రిక ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఏఎస్ఐ సైదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకసానికి యాదవ సంఘం నేతల అభినందన

చీరాల, పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నూకసాని బాలాజీని చీరాలకు చెందిన యాదవ సంఘం నాయకులు ఒంగోలు పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మించాల సాంబశివరావు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. బాలాజీకి ఛైర్మన్ పదవి ఇవ్వటం హర్షణీయమని చెప్పారు. గవిని వెంకటరావు, మచ్చా వెంగళరావు, పులి తిరుపతిరావు, పిట్టు బాలకృష్ణ, చిమటా లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

✦ నూకసాని బాలాజీని పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆయనతోపాటు పర్చూరు ప్రాంతానికి చెందిన నాయకులు నలగాటి మల్లికార్జున నాయుడు, కర్నేటి కృష్ణసింహవర్మ ఉన్నారు.

అవీ ఇవీ

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పర్చూరు(మార్టూరు): రైతులకు అవసరమైన ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ ఎన్.మోహనరావు తెలిపారు. పర్చూరు ఏఎంసీ ఆవరణలో శుక్రవారం సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, రైతులు ఒకటి కొనుగోలు చేస్తే మరో రకాన్ని అంటగట్టినా చర్యలు తప్పవన్నారు. తప్పనిసరిగా కొన్నవాటి వివరాలతో బిల్లు ఇవ్వాలని ఏడీఏ సూచించారు. ఏవోలు వేణు, సుధీర్, మెరమ్మ, ఆదినారాయణ, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీపీఎం నేత బత్తుల హనుమంతరావు కోరారు. శుక్రవారం కోలలపూడి, వలపర్ల గ్రామాల్లో సీపీఎం గ్రామ మహాసభలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. తాగునీరు వసతి, డ్రైనేజీ పారుదల వంటి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లో జెండాలు ఎగురవేశారు.

సమస్యలు పరిష్కరించాలి

చీరాల అర్బన్: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎఫ్‌సీఐ గోదాముల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాసి సైదయ్య పేర్కొన్నారు. శుక్రవారం కూలీ ధరలు పెంచాలని దేశాయిపేట గోదాముల వద్ద బంద్‌కు దిగారు. గడిచిన మూడు రోజులుగా దీనిపై నిరసనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సీపీఐ నేత మేడా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా సివిల్ సప్లయి కార్మికుల కూలీ ధరలు పెంచకపోవడం దారుణమన్నారు. కార్మికుల బంద్‌తో ఉదయం పూట చౌకధరల దుకాణాలకు చేరాల్సిన బియ్యం, నిత్యావసర వస్తుల సరఫరాకు విఘాతం కలిగింది. శ్రీను, అప్పన్న, రాంబాబు, వెంకటరెడ్డి ఉన్నారు.

గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు

చీరాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మరణించిన గోమాతకు మున్సిపల్ సిబ్బంది శుక్రవారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. పేరాల వాడరేవు రోడ్డులో ఆవును గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో మరణించింది. సమాచారం అందుకున్న పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కమిషనర్ చక్రవర్తి ఆదేశాలతో మహిళా కార్యదర్శి చేత ఆవుకు పూజలు చేయించి, అక్కడ నుంచి వాహనంలో తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

నెలాఖరుకు పుస్తకాలు అందించాలి

అద్దంకి: ఈ నెలాఖరుకు సెమిస్టర్-2 పుస్తకాలను విద్యార్థులకు అందించాలని ఎంఈఓ-2 బి.సుధాకరరావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. మధ్యాహ్న భోజనం దస్త్రాలను పరిశీలిస్తూ కచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాల ముఖచిత్రాలను ఎప్పటికపుడు ఉన్నతీకరించుకోవాలన్నారు. మనబడి, మన భవిష్యత్తు కార్యక్రమంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ

వెంపరాల(అద్దంకి): పోషకాహారం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని కొరిశపాడు సీడీపీవో డి.కృష్ణకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వెంపరాల అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు అవగాహన నిర్వహించారు. బాలింతలకు సీమంతం నిర్వహించారు.

యద్దనపూడి: యద్దనపూడిలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవనం సాగిస్తారని పర్యవేక్షకురాలు సుజాత వెల్లడించారు. గ్రామంలో కార్యకర్తలు, ఆయాలతో ప్రదర్శన నిర్వహించారు.

ఎస్టీవోను కలిసిన యూటీఎఫ్ నేతలు

చీరాల అర్బన్: ఇటీవల నూతన ఎస్టీవోగా బాధ్యతలు చేపట్టిన సుబ్బారావును చీరాల యూటీఎఫ్ నేతలు శుక్రవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విన్నవించడంతో పాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు వీరాంజనేయులు, వెలుగొండారెడ్డి, సురేష్, శ్రీనివాసరావు, సూరిబాబు ఉన్నారు.



బాబా విగ్రహానికి పాలాభిషేకం

పర్చూరు (మార్టూరు): పర్చూరు ఆలయంలో షిర్డీ సాయిబాబా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బాబా ఆలయంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు నిర్వహించిన పాలాభిషేకంలో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత

ఇంకొల్లు, పర్చూరు: బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ సందర్భంగా విశ్రాంత ఆకాశవాణి వ్యవసాయ విభాగ విశ్రాంత అధికారి వలేటి గోపీచంద్ రచించిన నాలుగు పుస్తకాలను పర్చూరు, వీరన్నపాలెం పాఠశాలలకు అందజేశారు. ఒక నేల..అనేక ఆకాశాలు, వెలుతురు తోవలు, వెలుగుపూలు, వెలుగు దివ్వెలు పుస్తకాలను ఇంకొల్లు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు గోపీచంద్ రచనలను శుక్రవారం పర్చూరు వైఆర్ ఉన్నత పాఠశాల, వీరన్నపాలెం నవభారతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రంథాలయాలకు అందజేశారు.